సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



శ్రీరామ నీనామమెంతో రుచిరా..

త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన శ్రీరామగానామృతం కార్యక్రమం వీనులవిందుగా సాగింది. ఐవీఎల్ శాస్త్రీయ సంగీత సభ ఉపాధ్యాయుడు ఆకొండ వెంకటరావు ఆధ్వర్యంలో 80 మంది కళాకారులు ఒకే వేదికపై రామనామ గానం చేసి ప్రేక్షకులను అబ్బురపరిచారు. కళాభారతి ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. గంటన్నరపాటు సాగిన ఈ కార్యక్రమం ఆహూతులను భక్తి పారవశ్యంలో మునిగేలా చేసింది. -మద్దిలపాలెం



కష్టజీవులపై కర్కశం

ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అత్యంత కర్కశంగా చిరువ్యాపారుల షాపులు, బడ్డీలను జేసీబీలతో నేలమట్టం చేసేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ పక్కన ఉన్న బడ్డీలను తొలగిస్తున్న విషయం తెలుసుకొని అక్కడకు వెళ్లి బాధితులకు సంఘీభావం తెలిపారు. బాధితులకు ప్రత్యామ్నాయం చూపించడంతోపాటు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చేతనైతే అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ కట్టడాలు, పార్కింగ్ లేని కమర్షియల్ కాంప్లెక్సులను కూల్చివేయాలి గానీ రెక్కాడితే కానీ డొక్కాడని చిరు వ్యాపారులను రోడ్డుపాల్జేయడం సరికాదన్నారు. -తాటిచెట్లపాలెం



దేవుడా.. ఎలా బతకాలి?

'పేదలను ఇంత దారుణంగా వంచించిన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ఉన్నపళంగా రోడ్డున పడేశారు. మా జీవనోపాధిని కొల్లగొట్టారు. మేం ఎలా బతకాలి? మా ఓట్లతో గద్దెనెక్కిన నాయకులకు మళ్లీ ఓట్లతోనే బుద్ధి చెబుతాం. మా కడుపులు కొట్టిన వాళ్లు ఎవరూ బాగుపడరు". సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రాంతంలో బడ్డీలు తొలగించడంతో చిరు వ్యాపారుల ఆక్రందన ఇది.



బతుకుదెరువును రోడ్డుపాల్జేశారు

జీవీఎంసీ దుశ్చర్యతో వీధి వ్యాపారుల జీవితాలు ఒక్కసారిగా ఛిద్రమయ్యాయి. నిన్న మొన్నటి వరకు చిరు వ్యాపారాలు చేసుకుంటూ పొట్ట పోసుకునే బక్కచిక్కిన బతుకులు రోడ్డు పాలయ్యాయి. జీవీఎంసీ పరిధిలో 8 జోన్లలో షాపుల తొలగింపు ప్రక్రియతో వీధి వ్యాపారులకు ఉపాధి లేకుండా పోయింది. సీతమ్మధార ప్రాంతంలో షాపుల తొలగింపుతో అక్కడే మహిళ కుప్పకూలిపోయింది.

-ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



తమకు న్యాయం చేయాలని కోరుతూ కారు షెడ్ జంక్షన్ నుంచి పీఎం పాలెం ఆఖరి బస్టాపు వైపు ర్యాలీగా వెళ్తున్న చిరు వ్యాపారులు



మధురవాడలో తొలగిస్తున్న బడ్డీలు

నౌకా నిర్మాణంలో నవశకం

భారీ నౌకల నిర్మాణంపై దృష్టి సారించిన భారత్

రెండు మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్ల ఏర్పాటుకు సన్నాహాలు

- అందులో ఒకటి శ్రీకాకుళం జిల్లా మూలపేటలో..?
- విశాఖలో ఇండియన్ షిప్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం
- నౌకా నిర్మాణ మార్కెట్‌లో వాటా పెంచుకోవడంపై గురి

రక్షణ ఉత్పత్తులు, త్రివిధ దళాల పాటవాల్లో అగ్రరాజ్యాలతో పోటీ పడుతున్న భారత్.. నౌకా నిర్మాణం విషయంలో మాత్రం ఇప్పటి వరకు వెనుకబడే ఉంది. చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు ఏటా ఈ రంగంలో దూసుకుపోతుంటే.. ఇన్నాళ్లూ నెమ్మదిగా నెట్టుకొచ్చిన భారత్ ఇప్పుడు తన వ్యూహాన్ని మార్చింది. మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్లు, ఇండియన్ షిప్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుతో భారత నౌకా నిర్మాణ రంగ దశ, దిశ మారబోతోంది. భారీ కార్గో నౌకల తయారీ కోసం అగ్రదేశాల వైపు చూసే పరిస్థితి నుంచి.. ఇకపై 3 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న నౌకలను తయారుచేసే శక్తిగా భారత్ అవతరించబోతోంది. దేశ తూర్పు, పశ్చిమ తీరాలకు మణిహారాల్లా ఈ మెగా షిప్ బిల్డింగ్ కేంద్రాలు రూపుదిద్దుకోనున్నాయి. -సాక్షి, విశాఖపట్నం

ప్రపంచ నౌకా నిర్మాణ మార్కెట్‌లో ప్రస్తుతం భారత్ వాటా కేవలం 0.06 శాతం మాత్రమే. చైనా, దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాలు 85 శాతం వాటాతో షిప్ బిల్డింగ్ పరిశ్రమపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. మన దేశ తీరానికి వచ్చే భారీ నౌకలకు ఏవైనా మరమ్మతులు అవసరమైతే, వాటిని బాగుచేసే అత్యాధునిక షిప్‌యార్డులు లేకపోవడం ఒక ప్రధాన లోటుగా కేంద్రం భావించింది. ఈ ఏడాది జూలైలో అరేబియా సముద్రంలో 'ఎంవీ మెర్స్క్ ఫ్రాంక్‌ఫర్ట్' అనే భారీ కార్గో షిప్ అగ్నిప్రమాదానికి గురైనప్పుడు.. దానికి అవసరమైన మరమ్మతు సౌకర్యాలు భారత్‌లో లేకపోవడంతో మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్ల ఆవశ్యకతను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో దేశంలోని రెండు ప్రాంతాల్లో రూ.75వేల కోట్ల పెట్టుబడులతో మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. తూర్పు, పశ్చిమ తీరాల్లో చెరొకటి చొప్పున ఈ క్లస్టర్లను 2030 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ప్రధాని మోదీ సమక్షంలో భావనగర్‌లో జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నం పోర్టు, ఏపీ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఏపీలో ఈ మెగా క్లస్టర్‌ను శ్రీకాకుళం జిల్లా మూలపేటలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మూలపేట పోర్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ మెగా క్లస్టర్లను పీపీపీ పద్ధతిలో పూర్తి చేయనుండగా.. కేంద్ర ప్రభుత్వమే రోడ్లు, భూమి అభివృద్ధి, విద్యుత్, నీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలను కల్పించనుంది.

నౌకల నిర్మాణం భారత్‌లో మొదలైనా..

సింధులోయ నాగరికత కాలంలోనే అంతర్జాతీయ వాణిజ్యం కోసం ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా నౌకల నిర్మాణాన్ని భారత్ ప్రారంభించింది. గుజరాత్, మహారాష్ట్ర, బెంగాల్ రాష్ట్రాల్లో భారీ చెక్క నౌకలను నిర్మించేవారు. మధ్యయుగంలో భారతీయ నౌకా నిర్మాణదారులు తయారు చేసిన నౌకలకు మంచి గిరాకీ ఉండేది. అయినప్పటికీ ఆధునిక షిప్‌బిల్డింగ్‌లో మనం వెనుకబడ్డాం. ప్రస్తుతం 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాల కింద ఉపాధి, ఎగుమతులు, దేశ రక్షణ, ఆర్థిక అభివృద్ధికి దోహదపడేలా నౌకా నిర్మాణ రంగాన్ని ప్రభుత్వం బలోపేతం చేస్తోంది. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, మన నావికా దళాన్ని ఆధునీకరించడంలో భాగంగా విమాన వాహక నౌకలు, జలాంతర్గాములు, యుద్ధనౌకలను నిర్మించడంలో ఈ షిప్ బిల్డింగ్ క్లస్టర్లు కొత్త ఒరవడిని సృష్టించనున్నాయి.

విశాఖలో ఇండియన్ షిప్ టెక్నాలజీ సెంటర్

విశాఖలోని ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ ఆవరణలో సాగరమాల పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఇండియన్ షిప్ టెక్నాలజీ సెంటర్‌ను(ఐఎస్‌టీసీ) ప్రధాని మోదీ శనివారం వర్చువల్‌గా ప్రారంభించారు. మారిటైమ్ విజన్–2030లో భాగంగా నెలకొల్పిన ఈ కేంద్రం.. మారిటైమ్ టెక్నాలజీకి జాతీయ హబ్‌గా మారనుంది. ఇక్కడ నౌకా నిర్మాణ అభివృద్ధిపై పరిశోధనలు, స్వదేశీ నౌకల రూపకల్పన, డిజిటల్ ఆవిష్కరణలు జరగనున్నాయి. ఇది దేశంలోని ప్రభుత్వ రంగ షిప్‌యార్డులకు అనుసంధానంగా పనిచేస్తూ, భారత నౌకా నిర్మాణ సామర్థ్యాన్ని పెంచనుంది. ఇక్కడే నేషనల్ షిప్ డిజైన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను కూడా పునరుద్ధరించేందుకు కేంద్రం అడుగులు వేస్తోంది.



షిప్‌యార్డులో నౌక నిర్మాణం



విశాఖలో ప్రారంభమైన ఇండియన్ షిప్ టెక్నాలజీ సెంటర్

భారీ నౌకల తయారీ సులభతరం

దేశంలో ప్రస్తుతం ఉన్న కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్, గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్, హిందూస్తాన్ షిప్‌యార్డ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు, ఎల్ అండ్‌టీ, రిలయన్స్ నావల్ అండ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ వంటి ప్రైవేట్ షిప్‌యార్డులకు ఈ కొత్త మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్ల ద్వారా విస్తృతమైన అవకాశాలు లభించనున్నాయి. ప్రస్తుతం గరిష్టంగా 1.25 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న నౌకలను మాత్రమే నిర్మిస్తున్న భారత్.. ఈ క్లస్టర్లు పూర్తయితే ఏకంగా 3 మిలియన్ టన్నుల వరకు కార్గో సామర్థ్యంతో అతిపెద్ద నౌకలను నిర్మించగలుగుతుంది. అదేవిధంగా భారీ యుద్ధనౌకలు, ప్రత్యేక నౌకల నిర్మాణం కూడా ఈ మెగా క్లస్టర్లలో జరగనుంది. దేశంలో విస్తరిస్తున్న చమురు, గ్యాస్ నిక్షేపాల వెలికితీతకు అవసరమైన డ్రెడ్జర్లు, ఆఫ్‌షోర్ సపోర్ట్ షిప్‌లకు పెరుగుతున్న గిరాకీని కూడా ఈ కేంద్రాలు తీర్చనున్నాయి.

విస్తరణకు భారీ అవకాశాలు

భారత నౌకానిర్మాణ పరిశ్రమ ఉద్యోగావకాశాల కల్పన, ఆర్థిక విస్తరణ, జాతీయ భద్రతకు అపారమైన సామర్థ్యాన్ని అందిస్తుంది. దేశంలో 200 కంటే ఎక్కువ చిన్న ఓడరేవులు, 12 ప్రధాన పోర్టులు, 7,500 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉండటం స్వదేశీ నౌకానిర్మాణాన్ని ప్రోత్సహించడానికి బలమైన పునాదిగా ఉంది. ఇన్ని అవకాశాలు ఉన్నప్పటికీ, ప్రపంచ మార్కెట్‌లో మన దేశ వాటా 1 శాతం కంటే తక్కువగా ఉంది. ఈ వాటా దక్షిణ కొరియా (25 శాతం), జపాన్ (18 శాతం), చైనా (47 శాతం) కంటే చాలా తక్కువ. ఆ దేశాలు బలమైన ఆర్థిక ప్రోత్సాహకాలు, అత్యాధునిక సాంకేతికతతో పర్యావరణ వ్యవస్థలను స్థాపించగా, భారత్ ఇప్పుడు ఆ దిశగా పయనిస్తోంది. 2024లో ప్రపంచ నౌకా నిర్మాణ మార్కెట్ విలువ 150.42 బిలియన్ డాలర్లు కాగా.. ఇది 2033 నాటికి 203.76 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ సముద్ర రవాణాకు అనుగుణంగా నౌకలకు డిమాండ్ పెరగనుండటంతో, ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి భారత్ సిద్ధమైంది.

మూడో రోజు 706 ఆక్రమణల తొలగింపు

డాబాగార్డెన్స్: ఆపరేషన్ లంగ్స్ పేరిట జీవీఎంసీ పరిధిలో మూడో రోజు శనివారం 706 ఆక్రమణలు తొలగించినట్లు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు తెలిపారు. గురు, శుక్రవారాల్లో అన్ని జోన్లలో 1,053 ఆక్రమణలు తొలగించామని పేర్కొన్నారు. మూడు రోజుల్లో ఇప్పటివరకు 1,759 ఆక్రమణల తొలగింపు ప్రక్రియ చేపట్టామన్నారు.

జోన్ల వారీగా తొలగింపులు ఇలా..

- జోన్–1 పరిధిలో తగరపువలస మెయిన్‌రోడ్డు, ఈఎస్‌ఐ హాస్పటల్ వద్ద 35 ఆక్రమణలు, భీమిలి క్లాక్ టవర్ వద్ద 16 ఆక్రమణలు.
- జోన్–2 పరిధిలో జాతీయ రహదారి–16 మిథిలాపురి వుడా రోడ్డు నుంచి గాంధీ విగ్రహం వరకు 22 ఆక్రమణలు. శ్రీకాంత్‌నగర్ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్, తోటగరువు జంక్షన్ మీదుగా అంబేడ్కర్ జంక్షన్, తోటగరువు జంక్షన్ మీదుగా పెదగదిలి జంక్షన్ వరకు 48 ఆక్రమణలు.
- జోన్–3 పరిధిలో సీతమ్మధార నుంచి గురుద్వారా జంక్షన్ వరకు 27 ఆక్రమణలు, ఎన్ఆర్ఐ హాస్పటల్ నుంచి గురుద్వార జంక్షన్ వరకు 15 ఆక్రమణలు, పోర్టు స్టేడియం రోడ్డు నుంచి ఏఎస్ఆర్ విగ్రహం వరకు 18 ఆక్రమణలు.
- జోన్–4 పరిధిలో అంబేడ్కర్ సర్కిల్ నుంచి జైల్‌రోడ్డు ఇందిరమ్మ విగ్రహం వరకు 157 ఆక్రమణలు, అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు 32 ఆక్రమణలు, రైల్వే రిజర్వేషన్ కౌంటర్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు 6 ఆక్రమణలు.
- జోన్–5 పరిధిలో ఊర్వశి జంక్షన్ నుంచి కంచరపాలెం వరకు 20 ఆక్రమణలు, ఊర్వశి జంక్షన్ నుంచి డిమార్ట్ వరకు 15 ఆక్రమణలు.
- జోన్–6 పరిధిలో పాత గాజువాక పోలీస్ స్టేషన్ జంక్షన్ నుంచి ఆటోనగర్ జంక్షన్ వరకు, వడ్లపూడి మెయిన్‌రోడ్డు, జాతీయ రహదారి నుంచి గాంధీ విగ్రహం, కాళింగవీధి సచివాలయం వరకు, 130 అడుగుల రోడ్డు, సమతా నగర్ జంక్షన్ నుంచి వంటిల్లు జంక్షన్ వరకు 30 ఆక్రమణలు, కణితిరోడ్డు, జగ్గు జంక్షన్ నుంచి కొత్త గాజువాక జంక్షన్ వరకు 24 ఆక్రమణలు.
- జోన్–7 పరిధిలో నెహ్రూ చౌక్ నుంచి సుంకరమెట్ట రోడ్డు వరకు 26 ఆక్రమణలు.
- జోన్–8 పరిధిలో వేపగుంట జంక్షన్ నుంచి గోశాల జంక్షన్ వరకు 15 ఆక్రమణలు, గోపాలపట్నం సింహాచలం ద్వారం నుంచి గోశాల జంక్షన్ వరకు 40, గోశాల జంక్షన్ నుంచి అడవివరం వరకు 10 ఆక్రమణలు తొలగించినట్టు సీసీపీ తెలిపారు.

ప్రజల భద్రత, రక్షణ కోసమే 'ఆపరేషన్ లంగ్స్'

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



డాబాగార్డెన్స్: ప్రజల భద్రత, రక్షణ, ఆరోగ్య పరిరక్షణకు, ఫుట్‌పాత్‌ల స్వేచ్ఛకు, విశాలమైన రోడ్ల ఉపశమనానికి, పాదచారులు, వాహనాలు లేని వారి సురక్షిత నడకకు, వాహనదారుల రాకపోకలకు రక్షణ కల్పించే ధ్యేయంగా ఆపరేషన్ లంగ్స్ 2.0 చేపడుతున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. నగరంలో ఫుట్‌పాత్‌లు, రోడ్లు, ప్రధాన జంక్షన్లలో అనధికారికంగా బడ్డీలు, తోపుడు బళ్లు, ఫుడ్ స్టాళ్ల వ్యాపారాలు కొనసాగించడం వల్ల.. ప్రజలు రోడ్ల నడుస్తూ ట్రాఫిక్‌లో చిక్కుకుంటూ ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. ప్రజలు హానికరమైన ఆహారం విక్రయించే ఫుడ్ స్టాళ్లలో ఆహార పదార్థాలు తింటూ క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు గురవుతూ అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. అందువల్లే ఫుట్‌పాత్‌ల నిర్వహిస్తున్న బడ్డీలు, స్టాళ్లను తొలగిస్తున్నట్లు తెలిపారు. చిరువ్యాపారులకు స్ట్రీట్ వెండింగ్ నిబంధనలకు అనుగుణంగా వెండింగ్ జోన్లలో కేటాయిస్తామన్నారు. ఫుట్‌పాత్‌లు, రోడ్లు, జంక్షన్లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులు స్వచ్ఛందంగా తమ వ్యాపారాలు తొలగించి జీవీఎంసీకి సహకరించాలని కోరారు.

దసరాకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

డాబాగార్డెన్స్: దసరా సందర్భంగా ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు 'సాక్షి'కి శనివారం తెలిపారు. విశాఖపట్నం రీజియన్ నుంచి సుమారు 150 అదనపు బస్సులు నడపడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం నడుస్తున్న బస్సులకు అదనంగా.. హైదరాబాద్, విజయవాడలకు రెండేసి బస్సులు నడుపుతామన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్ని బస్సులు కూడా అందుబాటులోకి తెస్తామని వివరించారు. విజయనగరం, బొబ్బిలి, శ్రీకాకుళం, సాలూరు, పార్వతీపురం, రాజాం వంటి ప్రాంతాలకు రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి 5 నుంచి 10 బస్సులు నడపడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దసరా తర్వాత తిరిగి ప్రయాణించే వారి కోసం హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ వంటి ప్రాంతాలకు రద్దీని బట్టి బస్సులు నడుపుతామని జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు వివరించారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీల్లో జిల్లా నేతలకు చోటు



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురికి కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ రాష్ట్ర పబ్లిక్ వింగ్ కార్యదర్శిగా పరవాడ ఈశ్వరరావు(విశాఖ దక్షిణ), రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా గుడపాటి వి.డబ్ల్యూ.జోసెఫ్(విశాఖ తూర్పు), కార్యదర్శులుగా గుంట సుందర్ రావు(విశాఖ పశ్చిమ), డోల ఆనంద్(భీమిలి), ప్రత్యేక అధికార ప్రతినిధిగా అల్లంపల్లి రాజుబాబు(విశాఖ తూర్పు), రాష్ట్ర వలంటీర్ వింగ్ జోనల్ ప్రెసిడెంట్‌గా మట్టి సునీల్‌కుమార్(విశాఖ ఉత్తర), రాష్ట్ర వలంటీర్ వింగ్ సంయుక్త కార్యదర్శిగా పచ్చిరాపల్లి రామారావు(విశాఖ దక్షిణ), రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ కార్యదర్శిగా శంఖబత్తుల సన్యాసిరావు(విశాఖ దక్షిణ), రాష్ట్ర దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శిగా పటాన సంషద్ భేగం (విశాఖ పశ్చిమ) నియమితులయ్యారు.



తీరం.. శుభ్రం

కోస్ట్‌గార్డ్ ఆధ్వర్యంలో బీచ్‌లో ఏర్పాటు చేసిన సైకత శిల్పాన్ని తిలకిస్తున్న విద్యార్థులు 11లో

సమస్యలు చెప్పనీయరా?

ఏయూ మహిళా హాస్టల్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆందోళన

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల బాలికల వసతిగృహం వద్ద శనివారం రాత్రి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల సావిత్రిబాయి వసతిగృహంలో సమస్యలు తెలుసుకోవడానికి వెళ్లిన భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) బాలికల విభాగం నాయకులను యాజమాన్యం లోనికి అనుమతించలేదు. అయితే, తమ సమస్యలు చెప్పడానికి విద్యార్థినులు బయటకు వస్తున్న తరుణంలో వర్సిటీ యాజమాన్యం, వార్డెన్ వారిని అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, నిరసనకారులకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రాత్రి వేళల్లో వసతిగృహంలోకి బయటివారిని అనుమతించబోమని యాజమాన్యం తెలిపిందని పోలీసులు సర్దిచెప్పారు. ఈ ఘటనపై ఎస్ఎఫ్ఐ బాలికల విభాగం కో-కన్వీనర్ పి.ప్రగతి మాట్లాడుతూ.. విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి తాము వస్తే అడ్డుకోవడం అన్యాయమన్నారు. విద్యార్థినులను ఇలా నిర్బంధించడం దారుణమని పేర్కొన్నారు. విద్యార్థినులందరూ ఏకమై హాస్టల్ వార్డెన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసినా యాజమాన్యం పట్టించుకోలేదని ఆరోపించారు. విద్యార్థుల నుంచి వేల రూపాయలు ఫీజులుగా వసూలు చేస్తూ నాణ్యత లేని భోజనం పెడుతున్నారని, మంచి నీటి సమస్యతో పాటు అనేక ఇతర ఇబ్బందులు ఉన్నాయని చెబుతున్నా వర్సిటీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థినుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ వర్సిటీ కార్యదర్శి డి.వెంకటరమణ, కమిటీ సభ్యులు సంజయ్, తరుణ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ బాలికల వసతి గృహం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

'చలో మెడికల్ కళాశాల' విజయవంతం



అదీప్‌రాజ్

పెందుర్తి: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన 'చలో మెడికల్ కళాశాల' కార్యక్రమం విజయవంతమైందని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, పెందుర్తి సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలిరావడంతో కూటమి ప్రభుత్వానికి ఏమీ పాలుపోవడం లేదన్నారు. పోలీసుల అడ్డంకులను దాటుకొని ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని, మెడికల్ కాలేజీలు పూర్తి కాలేదనే నాయకుల అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మెడికల్ కాలేజీల వద్దకు వెళ్లి ఫొటోలు, వీడియోలు ప్రదర్శించారన్నారు. ఇప్పటికైనా మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తూ ఇచ్చిన జీవోను తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో గిరిజన ప్రాంతంలో 500 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిందని, 70 శాతం పనులు పూర్తయ్యాయన్నారు.

జీవీఎంసీలోకి గ్రామీణ ప్రాంతాలు!

- లాభనష్టాలపై అధ్యయనం
- రూ.60కోట్లతో నగర సుందరీకరణ
- మధురవాడలో రూ.540 కోట్లతో యూజీడీ పనులకు త్వరలో టెండర్లు
- కలెక్టర్ హరేంధిరప్రసాద్ వెల్లడి



మహారాణిపేట: విశాఖ కేంద్రంగా నవంబర్‌లో పెట్టుబడుదారుల సదస్సు, వచ్చే ఫిబ్రవరిలో అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్) జరగనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఇందు కోసం నగరంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్ల అభివృద్ధి, పచ్చదనం పెంపు, పార్కుల ఆధునీకరణ, లైటింగ్ మెరుగుదల వంటి పనులపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. ఈ పనుల కోసం స్మార్ట్ సిటీ నిధుల నుంచి రూ.60 కోట్లు ఖర్చు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు పలు ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అంతేకాకుండా, మధురవాడ ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ(యూజీడీ) వ్యవస్థ ఏర్పాటు చేయడానికి ప్రపంచ బ్యాంక్ నుంచి రూ.540 కోట్ల రుణం మంజూరైందని కలెక్టర్ తెలిపారు. త్వరలో ఈ పనులకు టెండర్లు పిలవనున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ముందుకు రావడంతో, సుమారు ఐదు వేల ఎకరాల భూమిని సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. విశాఖ జిల్లాలో 89 శాతం జీవీఎంసీ పరిధిలో ఉందని, కేవలం 11 శాతం మాత్రమే గ్రామీణ ప్రాంతం ఉందని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు నాలుగు లక్షల జనాభా ఉన్నందున, ఆ ప్రాంతాలను జీవీఎంసీలో విలీనం చేయడం వల్ల ఎదురయ్యే లాభనష్టాలపై అధ్యయనం చేస్తున్నామన్నారు.

విశాఖ విశిష్టతను పెంచేలా ఈ-గవర్నెన్స్ సదస్సు

ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ విభాగం సెక్రటరీ కాటమనేని భాస్కర్ 11లో

తీరం.. శుభ్రం


చెత్త సేకరిస్తున్న హెచ్‌పీసీఎల్ సిబ్బంది, కుటుంబ సభ్యులు

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ తీరప్రాంత పరిశుభ్రత దినోత్సవాన్ని ఇండియన్ కోస్ట్‌గార్డ్–6 ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ప్రధానమంత్రి ఇచ్చిన స్వచ్ఛతా హి సేవ పిలుపును స్వీకరిస్తూ.. సాగర తీరాన్ని వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం(యూఎన్‌ఈపీ), సౌత్ ఏషియా కో–ఆపరేటివ్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం(ఎస్‌ఏసీఈపీ)లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీ ఎం.శ్రీభరత్, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, కోస్ట్‌గార్డ్ డిస్ట్రిక్ట్ హెచ్‌క్యూ–6 కమాండర్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజేష్ మిట్టల్ పాల్గొన్నారు. సీఐఎస్ఎఫ్, ఎన్‌సీసీ, అదానీ, హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్ సంస్థలతో పాటు పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఇండియన్ కోస్ట్‌గార్డ్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని.. సుమారు 600 కిలోల రీసైకిల్ చేయదగిన ప్లాస్టిక్ వ్యర్థాలను, మరో 700 కిలోల ఇతర వ్యర్థాలను సేకరించారు.


తీరంలో వ్యర్థాలను సేకరిస్తున్న యువత, విద్యార్థులు

● ప్రాణాలతో 'సెల్'గాటం

పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ.. సెల్‌ఫోన్ డ్రైవింగ్ కొనసాగుతూనే ఉంది. చలానాలు విధిస్తున్నా కొంతమంది వాహనచోదకుల్లో ఏ మాత్రం మార్పు రావడం లేదు. ఈ ఫొటోలో కనిపిస్తున్నట్లుగా.. కొందరు యువకులు మొబైల్‌ను హెల్మెట్ లోపల పెట్టుకుని మరీ వాహనాలు నడుపుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ.. తమ ప్రాణాలకు, ఇతరుల ప్రాణాలకు ముప్పు తెచ్చే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



రెయిలింగ్‌పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు


జూ పార్కు సమీపంలో ప్రమాదానికి గురైన బస్సు

ఆరిలోవ: జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉదయం సుమారు 7 గంటల సమయంలో విశాఖ నుంచి పార్వతీపురం వెలుతున్న ఆర్టీసీ బస్ జాతీయరహదారిపై జంతు పునరావాస కేంద్రం (ఏఆర్‌సీ) సమీపంలో అదుపుతప్పింది. దీంతో ఆ బస్ రోడ్డు పక్కన రెయిలింగ్‌పైకి దూకుపోయింది. సుమారు 50 మీటర్ల వరకు రెయిలింగ్ మీద నుంచి ముందుకు దూసుకుపోయి ఆగింది. దీంతో బస్సులో ఉన్న కొద్ది పాటి ప్రయాణికులు ఆందోళనకు గురై కేకలు వేశారు. అటుగా వెళ్లే వాహనచోదకులు బస్సులో ఉన్నవారిని సురక్షితంగా కిందకు దించారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏపీఈపీడీసీఎల్‌లో స్వచ్ఛాంధ్ర


మొక్కకు నీరు పోస్తున్న ఏపీఈపీడీసీఎల్ సీవీవో కింజరాపు వెంకట రామకృష్ణ ప్రసాద్

విశాఖ సిటీ: ఏపీఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్(సీవీవో) కింజరాపు వెంకట రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం సర్కిల్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం సిబ్బందితో కలిసి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విశాఖ సర్కిల్ ఎస్ఈ జి.శ్యాంబాబు, విజిలెన్స్–ఏపీటీఎస్ సీఐ ఇ.వెంకునాయుడు, జోన్–1 డీఈ పోలాకి శ్రీనివాసరావు, డీఈ టెక్నికల్ ఎం.ధర్మరాజుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం విజిలెన్స్–ఏపీటీఎస్ విశాఖ పోలీస్ స్టేషన్లను సీవీవో రామకృష్ణ ప్రసాద్ పరిశీలించారు. అక్కడ రికార్డులను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఆరోగ్యకర సమాజం మనందరి లక్ష్యం

విశాఖ సిటీ: పోలీసు కమిషనరేట్ ఆవరణలో శనివారం 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చితో పాటు ఉన్నతాధికారులు మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని పోలీస్ అధికారులు, సిబ్బందితో సీపీ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ స్వచ్ఛత.. ప్రతి పౌరుడి విధి అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడానికి అందరూ తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. డీసీపీ(అడ్మిన్) కృష్ణకాంత్ పటేల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

గడువులోగా మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్మాణం పూర్తి

వీఎంఆర్డీఏ చైర్మన్ ఆదేశం

విశాఖ సిటీ: భోగాపురం ఎయిర్ పోర్టుకు అనుసంధానించే ప్రధాన రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అధికారులకు సూచించారు. శనివారం ఆయన చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బృహత్ ప్రణాళిక రహదారులను నిర్దేశించిన 9 నెలల గడువులోగా పూర్తి చేయాలని చెప్పారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. వీఎంఆర్డీఏ పార్క్‌లో స్కేటింగ్ జాతీయ స్థాయి పోటీలు జరగనున్న నేపథ్యంలో స్కేట్ బోర్డ్ పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం అడవివరం–శొంఠ్యాం, శొంఠ్యాం–గుడిలోవ రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను సత్వరమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. వీఎంఆర్డీఏ సీఈ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ ప్రసాద్, మధుసూదన రావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ రవిశంకర్, ప్రసాద్, సహాయక ఇంజనీర్లు నాయుడు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులతో సౌమ్యంగా మెలగాలి

ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి


అధికారులకు ధ్రువీకరణపత్రాలు అందిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సాక్షి, విశాఖపట్నం: సమస్యలు వివరించడానికి వచ్చే విద్యుత్ వినియోగదారులతో అధికారులు, సిబ్బంది సౌమ్యంగా మాట్లాడాలని, వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. వినియోగదారుల పట్ల దురుసుగా ప్రవర్తించవద్దని స్పష్టం చేశారు. ఐఐఎం విశాఖపట్నం సహకారంతో, ఏపీఈపీడీసీఎల్ సాగర్ నగర్ శిక్షణ కేంద్రంలో 'ఆర్గనైజేషనల్ బిహేవియర్–మేనేజింగ్ పీపుల్'అనే అంశంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతో పని చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఉద్యోగుల నైపుణ్యాలను పెంచుతాయని, తద్వారా సిబ్బంది వినియోగదారులకు మరింత దగ్గర అవుతారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న చీఫ్ జనరల్ మేనేజర్లు, జనరల్ మేనేజర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు సీఎండీ పృథ్వీతేజ్ ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. సంస్థ ఫైనాన్స్–హెచ్‌ఆర్డీ డైరెక్టర్ డి.చంద్రం, ఐఐఎం ప్రోగ్రామ్ డైరెక్టర్లు ప్రొఫెసర్ హ్యాపీ పాల్, ప్రొఫెసర్ అనుపమ శర్మ పాల్గొన్నారు.

కార్మిక ఒప్పందాలు అమలు చేయాలి

విద్యుత్ ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

బీచ్‌రోడ్డు: గతంలో కార్మిక సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందాలను విద్యుత్ సంస్థల యాజమాన్యం అమలు చేయడం లేదని ఆరోపిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు(ఏపీఎస్‌పీఈ) నిరసన చేపట్టారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎస్‌పీఈ డిస్కం యూనిట్ చైర్మన్ గణపతి మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పరిస్థితులను, సమస్యలను ఇప్పటికే విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు, రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి స్వయంగా విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో శాంతియుత ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. జూనియర్ లైన్‌మన్ గ్రేడ్–2 (ఎనర్జీ అసిస్టెంట్) కు కొత్త సర్వీసు నిబంధనలను రద్దు చేసి, పాత నిబంధనలు వర్తింపజేసి పూర్తి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న అసిస్టెంట్ లైన్‌మన్ పోస్టుల్లో జూనియర్ లైన్‌మన్ గ్రేడ్–2లకు వెంటనే పదోన్నతి కల్పించాలని కోరారు. 1999 నుంచి 2004 వరకు నియమించిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని, కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ప్రకారం నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యం వాయిదాలను వెంటనే విడుదల చేయాలని నగదు రహిత అపరిమిత వైద్య సౌకర్యాన్ని అందుబాటులోకి తేవాలన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న అభద్రతాభావాన్ని తొలగించి, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని వారు కోరారు.

విశాఖ విశిష్టతను పెంచేలా ఈ–గవర్నెన్స్ సదస్సు

ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ విభాగం కార్యదర్శి కాటమనేని భాస్కర్


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాటమనేని భాస్కర్

మహారాణిపేట: విశాఖ నగర విశిష్టతను, ప్రాముఖ్యతను మరింత పెంచేలా ఈ నెల 22, 23వ తేదీల్లో నిర్వహించనున్న ఈ–గవర్నెన్స్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఐటీ, ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్స్ విభాగం సెక్రటరీ కాటమనేని భాస్కర్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో సదస్సు నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై సమీక్షించి అధికారులకు పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రి, కేంద్ర, రాష్ట్రాల ఉన్నత స్థాయి అధికారులు సదస్సులో భాగస్వామ్యం అవుతారని, వారంతా హర్షించేలా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. ఎయిర్ పోర్టు, రైల్వే స్టేషన్, నగరంలోని ప్రముఖ ప్రాంతాల్లో హోర్డింగ్లు పెట్టాలని చెప్పారు. నోవాటెల్ హోటల్ వద్ద వైద్య బృందాలు, ఆధునిక సదుపాయాలు కలిగిన అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ట్రావెలింగ్ ప్లాన్ పక్కాగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమ నిర్వహణకు అనుగుణంగా నియమించిన కమిటీలు, ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను పీపీటీ ద్వారా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ విభాగం ఎండీ సూర్యతేజ, డీసీపీ కృష్ణకాంత్ పాటిల్, డీఆర్వో భవానీ శంకర్, పలువురు డిప్యూటీ కలెక్టర్లు, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జియో స్పేషియల్ టెక్నాలజీ అనువర్తనాలు అపారం

ఐఎస్‌పీఆర్ఎస్ చైర్మన్ ఆచార్య మురళీకృష్ణ


మాట్లాడుతున్న ఐఎస్‌పీఆర్ఎస్ చైర్మన్ ఆచార్య మురళీకృష్ణ

మద్దిలపాలెం: ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధిని, ఆవిష్కరణలను ప్రజలు తమ జీవితంలో భాగం చేసుకోవాలని వర్కింగ్ గ్రూప్ ఐఎస్‌పీఆర్ఎస్ చైర్మన్ ఆచార్య ఐ.వి.మురళీకృష్ణ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఇండియన్ సొసైటీ ఆఫ్ జియోమ్యాటిక్స్ విశాఖ ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో 'జియోస్పేషియల్ టెక్నాలజీస్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఇష్యూస్'అనే అంశంపై శనివారం ఒక్క రోజు వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జియోస్పేషియల్ టెక్నాలజీస్ అనువర్తనాలు అపారమని, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సంఖ్య పెరిగితే మేక్ ఇన్ ఇండియా కల సాకారమవుతుందన్నారు. విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, డీప్ టెక్నాలజీలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ జియోస్పేషియల్ రంగంలో ఏయూ చేస్తున్న కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని తెలిపారు. దీనికి నిదర్శనంగా విశ్వవిద్యాలయానికి లభించిన 'బెస్ట్ యూనివర్సిటీ అవార్డు', ఆచార్య వజీర్ మహమ్మద్‌కు లభించిన 'నేషనల్ జియోస్పేషియల్ ఫ్యాకల్టీ అవార్డు'లను ప్రస్తావించారు. జియోస్పేషియల్ స్టూడెంట్ క్లబ్ ఏర్పాటు చేయాలని, ప్రాజెక్టులకు విశ్వవిద్యాలయం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. సదస్సు కన్వీనర్ ఆచార్య వజీర్ మహమ్మద్, విభాగాధిపతి ఆచార్య సి.ఎన్.వి. సత్యనారాయణరెడ్డి వర్క్‌షాప్ ప్రాముఖ్యత, విద్యార్థుల భాగస్వామ్యం గురించి వివరించారు.

రేపు జీఎస్టీ సంస్కరణలపై ఉత్సవాలు



బీచ్‌రోడ్డు: జీఎస్టీ సంస్కరణలపై ఈనెల 22న జీఎస్టీ 2.0 పేరిట ఉత్సవాలు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ తెలిపారు. శనివారం నగరంలోని ఒక హోటల్‌లో జీఎస్టీ సంస్కరణలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా జీఎస్టీ సంస్కరణలు తీసుకొచ్చిన ప్రధాని మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దసరా కానుకగా జీఎస్టీలో మార్పులు తీసుకొచ్చి గొప్ప బహుమతి ప్రకటించారని ఆనందం వ్యక్తం చేశారు. జీఎస్టీ సంస్కరణలను అన్ని రాష్ట్రాలు ఆమోదం తెలియజేశాయన్నారు. పన్నుల భారం తగ్గడం వల్ల ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, పార్టీ అధికార ప్రతినిధులు సుహాసిని, నాయకులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సదుపాయాల పరిశీలన


రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలను పరిశీలిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌ను వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా శనివారం సందర్శించారు. పండగల రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఆయన పరిశీలించారు. లిఫ్టులు, ఎస్కలేటర్లు, తాగునీటి సదుపాయం, ప్లాట్‌ఫారాల పరిశుభ్రత వంటి అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే వెయిటింగ్ హాళ్లు, ఏసీ లాంజ్‌లు, ఫుడ్ కోర్టులు, పార్కింగ్ ప్రాంతాలు, బుకింగ్ కౌంటర్లను పరిశీలించి, రైల్వే మార్గదర్శకాల ప్రకారం విధులు జరుగుతున్నాయా లేదా అని నిర్ధారించుకున్నారు. ఈ పర్యటనలో డీఆర్ఎంతో పాటు కమర్షియల్, ఇంజనీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఆపరేషన్స్, సెక్యూరిటీ, సిగ్నల్ అండ్ టెలికం విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	:రూ.130
బ్రాయిలర్ (లైవ్)	:రూ.150
స్కిన్	:రూ.270
స్కిన్‌లెస్	:రూ.280

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	555.00
విజయనగరం	559.00
శ్రీకాకుళం	55.00